క్లుప్తంగా

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో బుధవారం వైద్య సిబ్బంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. తాడిమర్రి, పెద్దకోట్ల, చిల్కలొండయ్యపల్లి, పిన్నదరి, దాడితోట, నార్శింపల్లి, కునుకుంట్ల, చిల్లవారిపల్లి, ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు చిన్నారులకు డీటీపీ, పెంటా, హెపటైటిస్ బీ తదితర వ్యాక్సిన్లు వేశారు. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



సునీల్‌నాయక్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని చవిటితాండాకు చెందిన నిరుపేద విద్యార్థి సునీల్‌నాయక్‌కు బుధవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. చవిటితండాకు చెందిన నిరుపేద పీరేనాయక్ కుమారుడు సునీల్‌నాయక్ మణిపూర్‌లో జేఈఈ మెయిన్స్ చదువుతున్నాడు. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ల్యాప్‌టాప్ ఇస్తానని విద్యార్థికి హామీ ఇచ్చారు. స్థానిక నాయకులతో ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు ఆపన్నహస్తం



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన కృష్ణమూర్తి ఆరోగ్యం బాలేక ఈనెల 7న ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌ల అందజేత



విద్యార్థులకు నగదు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ (సీఎస్ఆర్‌స్కీం) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రతిభను ప్రోత్సహిస్తూ కెనరా బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనరసింహ స్కాలర్‌షిప్‌లను అందించారన్నారు. అంజలికి రూ.5 వేలు, గంగోత్రికి రూ.5 వేలు, మాధవికి రూ, 2500, దివ్యశ్రీకి రూ, 2,500 అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, గోపాల్, చంద్రకళ, శ్రీ లక్ష్మీ తదితరులున్నారు.

కార్మికుల డిమాండ్లు తీర్చాలి

ముదిగుబ్బ: పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలంటూ బుధవారం ముదిగుబ్బలో కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెద్దన్న, ఓబిలేసు, ఆదినారాయణ, ఈశ్వరయ్య, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించండి



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రమణ బాబు

నల్లచెరువు: తలమర్ల వాండ్లపల్లి గ్రామంలోని యర్రగుంటపల్లి సచివాలయంలో బుధవారం రీ సర్వే కార్యక్రమంపై రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రమణ బాబు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రతి రైతు సహకరించాలని కోరారు. సర్వే సమయంలో అందుబాటులో ఉండి పొలం సంబంధించిన హద్దులను అధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అశోక్, వీఆర్వో ఓబులేషు మండల సర్వేయర్లు రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయానం..చరిత్రాత్మకం



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



పెడపల్లి పాఠశాలలో చంద్రయాన్ ప్రక్రియను తిలకిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్/కనగానపల్లి/ కదిరి టౌన్: దేశ అంతరిక్ష రంగంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్కంఠ భరితకు బుధవారం సాయంత్రం ఎట్టకేలకు తెరపడింది. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ –3 బుధవారం విజయవంతమైంది. శాస్త్ర, సాంకేతిక రంగంలో ఇస్రో నవశకం సృష్టించి విశ్వ ఖ్యాతి గడించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ అడుగు పెట్టినట్టు శాస్త్రవేత్తలు ప్రకటించగానే 140 కోట్ల మంది భారతీయులు సంబరంలో మునిగితేలారు. కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున సంబరాలు చేసి మిఠాయి పంచిపెట్టారు.

మురిసిన విద్యార్థులు

పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ –3 ని వీక్షించే భాగ్యాన్ని పాఠశాల హెచ్ఎం రామచంద్రారెడ్డి విద్యార్థులకు కల్పించారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ల్యాండర్ చంద్రునిపై దిగే అద్భుత సన్నివేశాన్ని పాఠశాల విద్యార్థులకు చూపించాలని మూడు టీవీలను అమర్చి అవకాశాన్ని కల్పించారు. విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా తిలకించి హెచ్ఎంకు కృతజ్ఞతలు చెప్పారు. ఇక.. పుట్టపర్తి పట్టణంలోని హనుమాన్ కూడలిలో బుధవారం సాయంత్రం బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ధర్మవరంలో ర్యాలీ

ధర్మవరం అర్బన్: చంద్రయాన్–3 విజయవంతంపై పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి పీఆర్‌టీ సర్కిల్‌లో బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. సుందరయ్యనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాతో వార్డులో ర్యాలీ చేపట్టారు.

సరికొత్త అధ్యాయం



చంద్రుడి దక్షిణ ధ్రువంపైకి చేరి అంతరిక్ష చరిత్రలో భారత్ సరికొత్త అధ్యాయం లిఖించింది. తొలిదేశంగా నిలవడం సంతోషకరం. ఇది మన దేశం సాధించిన ఘనత. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. – డాక్టర్ సిద్దారెడ్డి, కదిరి ఎమ్మెల్యే

శాస్త్రవేత్తలకు అభినందనలు



చంద్రయాన్– 3 ను విజయవంతం చేసి వ్యోమ నౌక విక్రమ్‌ను చంద్రుడిపై ల్యాండ్ చేయటం రోదసి చరిత్రలో ఒక మైలురాయి. ప్రపంచ అగ్ర దేశాలైన అమెరికా, రష్యా, చైనాను తలదన్నేలా తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై వ్యోమనౌక దింపడం మన ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన గొప్ప ఘనత. దీనికి కారణమైన శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నా.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే

గర్వకారణం



మన ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్–3 విజయవంతం చేయటం దేశానికి గొప్ప గర్వకారణం. ప్రపంచ దేశాల్లోనే తొలిసారిగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై వ్యోమ నౌక విక్రమ్‌ను ల్యాండ్ చేయటం గొప్ప విషయం. దీనిపట్ల ప్రతి భారతీయుడు గర్వపడాలి.

– నరసమ్మ, ప్రిన్సిపాల్, కేజీబీవీ కనగానపల్లి

ప్రపంచంలోనే అగ్రగామి..



చంద్రయాన్– 3 ని సక్సెస్ చేయటం మన ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన గొప్ప ఘనత. దీనికి ప్రతి భారతీయ పౌరుడు గర్వపడాలి. ఇలాంటి ప్రయోగాలతో భారతదేశం రోదసీ యానంలో మరింత ముందుకు పోయి ప్రపంచ దేశాలలోనే అగ్రగామిగా నిలవబోతుంది. దీంతో ప్రతి భారతీయుడి గుండె ఉప్పొంగుతోంది.

రవికిరణ్, ప్రిన్స్‌పాల్, మోడల్ స్కూల్, కనగానపల్లి

'మహిళా శక్తి'కి దరఖాస్తు చేసుకోండి

తాడిమర్రి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం సాంబశివుడు కోరారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెంది ఏడో తరగతి చదివిన 20 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసులోపు మహిళలు అర్హులు అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా ఆటో నడుపుకోవడానికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న యువతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హత, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుల నకళ్లను తీసుకుని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభం



ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి క్రాస్‌లో నిర్మించిన మాహి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి కుటుంబం సుమారు రూ.2 కోట్లతో రెండెకరాల్లో ఫంక్షన్ హాల్‌ను అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చింది. వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉద్యోగులకు మేలు చేసేలా సీఎం నిర్ణయాలు

● ఎమ్మెల్యే దుదుకుంట శ్రీధర్‌రెడ్డి



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో ఉద్యోగులందరూ సంతోషంగా ఉండాలన్న సంకల్పంతో వారికి ఎంత ఎక్కువ మేలు చేయగలమన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం 23 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ క్లస్టర్ పరిధిలోని ఆ శాఖ ఉద్యోగులు పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన సమక్షంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిత్యం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆలోచిస్తున్నారన్నారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినప్పటికీ ఎంత భారమైనా ఉద్యోగులు సంతోషంగా ఉండాలని పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా మాత్రమే ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ప్రచారం చేస్తున్నాయన్నారు. రాబోవు రోజులలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకోబోతున్నారన్నారు. ఉద్యోగులందరూ మరో మారు జగనన్నకు అండగా నిలవాలని కోరారు. పలువురు సెర్ప్ ఉద్యోగులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా 23 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించి ఫిట్‌మెంట్ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి క్లస్టర్ పరిధిలోని ఏరియా కోఆర్డినేటర్లు, ఏపీఎంలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి: మైనార్టీల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని కదిరి ఎమ్మెల్యే, మైనార్టీ వెల్ఫేర్ అసెంబ్లీ కమిటీ సభ్యులు డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. వెలగపూడి అసెంబ్లీ కమిటీ హాల్‌లో మైనార్టీ వెల్ఫేర్ అసెంబ్లీ కమిటీ చైర్మన్ ముస్తఫా అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో కదిరి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు హయాంలో మైనార్టీ సంక్షేమ శాఖ కూడా ముస్లింలకు ఇవ్వలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించడంతో పాటు ఆ మొత్తాలను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో ఐదు చోట్ల ముస్లింలకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వడంతో పాటు వారిలో ఒకరిని డిప్యూటీ సీఎం చేసిన ఘనత కూడా సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శాసనమండలిలో కూడా నలుగురు ముస్లింలకు అవకాశం కల్పించారని, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా ముస్లిం మహిళ జకియాఖానంను నియమించిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఒకరికి, ఇద్దర్ని మేయర్లుగా, 11 మంది మున్సిపల్ చైర్‌న్‌లుగా ముస్లింలనే నియమించామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. జనరల్ కోటాలో కూడా ఆరుగురికి చైర్మన్ పదవులు ముస్లిం మైనార్టీలకే ఇచ్చిన ఘనత జగన్ సర్కారుకే దక్కుతుందని చెప్పారు. ఇంకా నామినేటెడ్ పదవుల్లోనూ, పార్టీ పదవుల్లోనూ ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేసి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని సీఎం జగన్ నిరూపించుకున్నారని తెలియజేశారు. అంతకు మునుపు ఇంకా మైనార్టీల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టవలసిన పనులపై తన అభిప్రాయాలను వెలిబుచ్చారు.

డ్రాపౌట్స్ అనే వారు ఉండొద్దు



మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి

ధర్మవరం రూరల్: పాఠశాలల్లో డ్రాపౌట్స్ అనే వారు ఉండకుండా ప్రతి ఒక్కరికి చదువును కొనసాగించేలా చర్యలు చేపట్టాలని జిల్లా గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు, సీఆర్పీలకు, వలంటీర్లకు రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు పాఠశాల, కళాశాలల్లో చదువుకోకపోయిన వారిని గుర్తించి రీ అడ్మిషన్ చేయించి చదువు కొనసాగేలా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. వారం రోజుల లోపు కలెక్టర్ ఆదేశాల మేరకు నూటికి నూరు శాతం గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో చేయాలని ఆయన సూచించారు. జిల్లాలోనే ప్రథమంగా బత్తలపల్లి, ధర్మవరం మండలాల వారు డ్రాప్అవుట్ లేకుండా ప్రథమ స్థాయిలో వున్నారని ఎంపీడీఓ సాజన్య కుమారిని ఈ సందర్భంగా అభినందించారు. ఎంఈఓలు సుధాకర్ నాయక్, గోపాల్‌నాయక్, డీవీఈఓ రఘునాథరెడ్డి, ఏఓ నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువు కొనసాగించాలి

పుట్టపర్తి అర్బన్: పదో తరగతి అనంతరం విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగించాలని, ఎవరైనా తప్పుకొని ఉంటే వారి వివరాలను సేకరించాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి విద్యాశాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగాలను ఆదేశించారు. బుధవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10, ఇంటర్, డిగ్రీలో ఫెయిలైన విద్యార్థులు ప్రస్తుతం ఏమి చేస్తున్నారు, పాసై గైర్హాజరవుతున్న విద్యార్థులు ఏమి చేస్తున్నారనే విషయాలను, వారి ఫోన్ నంబర్లు, ఆధార్, అడ్రస్‌లను సేకరించి తగు సూచనలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న జీఇఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే)లో వివరాలను సేకరించాలన్నారు. ప్రతి విద్యార్థి డేటా అవసరమన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా అనుమానాలు వస్తే సంబంధిత ఎంపీడీఓలను, ఎంఈఓలతో నివృత్తి చేసుకోవాలన్నారు. పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు మరోసారి తరగతులకు వెళ్లే వెలుసుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. అందరూ సద్వినియోగం చేసుకొని చదువు కొనసాగించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీవైఈఓ రఘునాథరెడ్డి, ఎంఈఓ ప్రసాద్, ఆర్ఐఓ సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ధర్మవరం రూరల్: చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి ఆంజనేయస్వామి దేవాలయానికి పట్టణంలోని 27వ వార్డు కౌన్సిలర్ డోలా రాజారెడ్డి రూ. 13 వేలను విరాళంగా అందజేశారు. బుధవారం ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డోలా రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గాండ్లపెంట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.రామానాయక్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ తాతం జగన్మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ రహంతుల్లా, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహాసంఘం అధ్యక్షుడు శంకర్ నాయుడు, ఎంఈఓ క్రిష్ణానాయక్, కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ రామానాయక్ గాండ్లపెంట, కటారుపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టి, వైఎస్సార్ చేయూత వివరాలను తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడుతూ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.

తహసీల్దార్ వైఖరిపై నిరసన

గాండ్లపెంట: కుల,ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో మండల తహసీల్దార్ హమీద్ బాషా జాప్యం చేస్తున్నారని కురుమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామ సచివాలయంలో మహిళలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన పత్రాలను మంజూరు చేసేందుకు అన్ని రుజువులు జత చేసినా జాప్యం చేస్తున్నారని వాపోయారు.

పాత్రికేయులకు సన్మానం



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రకుమార్

ఎన్‌పీకుంట: స్థానిక శ్రీనాగార్జున ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద బుధవారం మండలంలో వివిధ పత్రికలలో విధులు నిర్వహించే పాత్రికేయులకు 'మానవత' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ నరేంద్ర కుమార్, ఎంపీడీఓ ఆదినారాయణ హాజరై మాట్లాడుతూ మానవత సంస్థ తరపున నిర్వహించే కార్యక్రమాలన్నీ పేదప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. మండలంలో మానవత సంస్థ ఏర్పాటు చేసి 6 సంవత్సరాలు పూర్తయ్యిందని తెలిపారు. అనంతరం విలేకరులను దుశ్శాలువతో సత్కరించి, మొమెంటోలను అందించారు. కార్యక్రమంలో మానవత మండల కమిటీ అధ్యక్షులు కె.మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు సి.ఎం. రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ గంగిరెడ్డి, జాయింట్ సెక్రటరీ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ కొత్తరంగారెడ్డి, కన్వీనర్ ఓబుళరెడ్డి, రిటైర్డ్ బ్యాంక్ అధికారి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



కార్యకర్తలతో మాట్లాడుతున్న అధికారి

బత్తలపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం జిల్లా ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం) పోగ్రాం అధికారి డాక్టర్ చెన్నారెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం–1 పరిధిలోని 1, 2, 4 కేంద్రాలను సందర్శించారు. చిన్నారులకు డీవార్మింగ్ పోగ్రాం ద్వారా అందిస్తున్న ఆల్బెండజోల్ సిరప్స్, రక్తహీనత నివారణకు అందించే ఐరన్ సిరప్స్, చిన్నారులకు అందించే పోషకాహారం, వారి వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య స్థితి గతులను గురించి అంగన్‌వాడీ వర్కర్స్ క్రిష్ణవేణి, జయసుధ, సున్నీ భేగం ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ రాజశేఖర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్‌రెడ్డి, నారమ్మ, పాల్గొన్నారు.

డైట్‌లో ఘనంగా ఫ్రెషర్స్‌డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

పుట్టపర్తి: బుక్కపట్నం జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికే కార్యక్రమాన్ని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ఛాత్రోపాధ్యాయులకు దేవాలయం లాంటిదని తెలిపారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసిన వారిలో 90 శాతం మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. టీచర్లుగా మారిన తర్వాత క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వేగేట్ బంద్

అనంతపురం సిటీ: అనంతపురం-ధర్మవరం మార్గంలోని చిగిచెర్ల-జంగాలపల్లి మధ్యలోని రైల్వే గేట్‌ను మూడ్రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే లైన్ మరమ్మతులతో పాటు నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి శనివారం వరకు తాత్కాలికంగా గేట్‌ను మూసివేస్తామన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా హోమాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లి వడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీమహాలక్ష్మీ దేవాలయం, శ్రీపద్మావతి-శ్రీనివాస కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. నేటి మూడు రోజులు పాటు నిర్వహించే వేడుకలను పురోహితులు ధర్మవరం అవధానం శ్రీనాథశర్మ, పవన్ కుమార్ శర్మల ఆధ్వర్యంలో పండితులు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య పూజ, కలశస్థాపన అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం మహాగణపతి హోమం, రాక్షోఘ్న హోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమాలు నిర్వహించారు ఆలయ శాశ్వత ధర్మకర్త పూజారి మంజుల రమణయ్య ఉన్నారు.

రైతులకు అండగా ఉంటాం



రుణాలు అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని 51 మంది రైతులకు బుధవారం పీఏసీఎస్ చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వల్ప కాలిక రుణాలు, పశుపోషణకు సంబంధించి రైతులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకూ రూ.1.10 కోట్ల రుణాలు అందజేశామన్నారు. నియోజకవర్గంలో ఎటు చూసినా నీరు ఉండటంతో పంటలు సమృద్ధిగా పండుతున్నాయన్నారు. రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ నారపరెడ్డి తదితరులున్నారు.